క్లుప్తంగా

సేవలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న కిశోర్‌కుమార్

రాజాం సిటీ: సమాజానికి మేలు కలిగించే విధంగా రోటరీ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయాలని పీడీసీ చెరుకుమల్లి కిశోర్‌కుమార్ సూచించారు. స్థానిక కల్కి ఇన్‌లో రాజాం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికను ఆదివారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా గట్టి పాపారావు, ఉపాధ్యక్షుడిగా బి.వి.అచ్యుత్‌కుమార్, కార్యదర్శిగా సప్పటి వసంతరావుతో పాటు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వారితో కిశోర్‌కుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, క్లబ్ మాజీ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

రాజాం సిటీ: మండల ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక పట్టణంలోని ప్రెస్‌క్లబ్ వద్ద ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా పి.వెంకటరావు, ఉపాధ్యక్షులుగా వి.శ్రీనివాసరావు, జి.సూర్యనారాయణ, కార్యదర్శిగా కె.సురేష్‌కుమార్‌తో పాటు మరో 11 మందిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు శర్మ, వి.శశి, యాదవ్, తిరుమల, శేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం



విశ్రాంత ఉపాధ్యాయుడు రాజశేఖర్‌ను సత్కరిస్తున్న ఫెల్ట్ సభ్యులు

రాజాం సిటీ: రేగిడి మండలంలోని పనసలవలస ఉన్నత పాఠశాలలో పనిచేసి ఉద్యోగవిరమణ చేసిన ఉపాధ్యాయుడు ఎస్.రాజశేఖర్‌ను ఫెల్ట్ (ఫోరం ఫర్ ఇంగ్లిష్ ల్యాంగ్వేజ్ టీచర్స్) ఆధ్వర్యంలో రాజాం పట్టణంలో ఆదివారం సత్కరించా రు. అతిథిగా హాజరైన రేగిడి ఎంఈఓ ఎం.వి. ప్రసాదరావు మాట్లాడుతూ ఏ ఉద్యోగికైనా తాను అందించిన సేవలే సమాజంలో తగిన గుర్తింపును తీసుకువస్తాయని అన్నారు. ఫెల్ట్ అధ్యక్ష,కార్యదర్శులు బి.వి. అచ్యుత్‌కుమార్, ఆర్.వి.జె.నాయుడు, ఏ.దామోదరరావు, పి.శ్రీనివాసరావు, ఆర్.మోహన్, వై.భాస్కరరావు, సూర్యకుమారి, హేమలత, వి.సూర్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ



చెత్త తరలింపు పనులను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: పట్టణంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ తెలిపారు.పట్టణంలోని ఆదినారాయణకాలనీ, మెంతిపేటకాలనీ, బొబ్బిలిరోడ్డు ప్రాంతాల్లో ఆదివారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. పారిశుద్ధ్య కార్మికులు వీధి కాలువల్లో చెత్త, పూడిక తొలగించడంతో పాటు ప్రధాన కూడళ్లలో ఉన్న చెత్తకుప్పలను వాహనాల్లో తరలించారు. ఆయా ప్రాంతాల్లో మహిళలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



సీఐటీయూ మండల సమన్వయ కమిటీ సభ్యులతో సురేష్

రామభద్రపురం: స్మార్ట్ విద్యుత్ మీటర్లను రద్దు చేసి,విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఐటీయూ మండల సమన్వయ కమిటీ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. మండల కన్వీనర్‌గా బలస శ్రీనివాసరావు,కో–కన్వీనర్లుగా జి.కుమారి.జి అరుణను,15 మంది సభ్యులతో మిగతా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గ వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయని విమర్శించారు. లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.స్కీమ్ వర్కర్స్‌కు కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు,మధ్యాహ్నభోజన కార్మికులు,గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

లక్ష్యం కొండంత.. చేరుకున్నది గోరంత..!

- కంపోస్టు ఫిట్ తవ్వకాలపై ఆసక్తి కనబరచని రైతులు
- వీటి తవ్వకాలకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- రాజాం నియోజకవర్గంలో 21,730 యూనిట్‌ల్ లక్ష్యం
- ఇప్పటి వరకు పూర్తయినవి 630 మాత్రమే
- లక్ష్యాలను చేరుకోలేక సతమతమవుతున్న ఉపాధి హామీ సిబ్బంది



గార్రాజు చీపురుపల్లిలో రైతులు తవ్విన కంపోస్టు ఫిట్‌ను పరిశీలిస్తున్న ఉపాధి హామీ సిబ్బంది (ఫైల్)

రాజాం: రసాయన ఎరువుల కొరతను నివారించేందుకు, వాటి వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా కంపోస్టు ఫిట్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పథకం ద్వారా అందించే ప్రోత్సాహంతో రైతులే సొంతంగా తమ పొలాలు, కల్లాల వద్ద కంపోస్టు ఫిట్‌లు తవ్వించుకుని, వాటిలో సేంద్రియ ఎరువు తయారు చేసుకోవాలన్నది ప్రభుత్వం ఉద్దేశం. ఇందుకోసం అర్హులను గుర్తించడంతో పా టు వారికి పనులు మంజూరు చేశారు. కానీ రైతులు వీటిని తవ్వించేందుకు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదు. ప్రతీ పంచాయతీలో 180 కంపోస్టు ఫిట్‌లను తవ్వించాలని అధికారులు లక్ష్యం విధించుకున్నారు. రాజాం నియోజకవర్గంలో మొత్తం 21,730 యూనిట్‌ల్ లక్ష్యం కాగా కేవలం 1800 మంది రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 630 మంది మాత్రమే వీటిని తవ్వించారు.

ఎన్నో ప్రయోజనాలు..

కంపోస్టు ఫిట్‌లతో మంచి ప్రయోజనాలు ఉన్నాయని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన రైతులు తమ పంట పొలా ల్లో, కల్లాల్లో 5 అడుగుల పొడవు, వెడల్పు,



బొద్దాం వద్ద తవ్విన కంపోస్టు ఫిట్

చుట్టు కొలతతో వీటిని తవ్వించాలి. గుంతలు తవ్వేందుకు రైతుకు రూ. 900లు వరకు ఉపాధి వేతనం అందు తోంది. ఈగుంతల్లో వ్యర్థాలు,చెత్త వేయడం ద్వారా అవి కుళ్లి సేంద్రియ ఎరువు తయారవుతుంది. ఒక ఫిట్ ద్వారా వచ్చే సేంద్రియ ఎరువును అర ఎకరా పొలా నికి వినియోగించుకోవచ్చు.అయితే వీటి వల్ల కలిగే ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో రైతులకు వివరించడంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల వైఫల్యం కనిపిస్తోంది. ఫలితంగా దరఖాస్తులు తక్కువగా రావడంతో పాటు నిర్మాణాలు కూడా నామమాత్రంగానే జరిగాయి.

అవగాహన కల్పించాం..



గ్రామసభలు నిర్వహించి కంపోస్టు ఫిట్‌ల వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాం. లక్ష్యాలను చేరుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు తాము పదేపదే చెబుతున్నాం. ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా తరచూ రైతులను కలిసి కంపోస్టు ఫిట్‌లు తవ్వించాలని కోరుతున్నప్పటికీ పెద్దగా స్పందన రావడం లేదు. రాజాం మండలంలో మండలంలో 3,990 యూనిట్లు లక్ష్యం కాగా, 380 యూనిట్లకు మాత్రమే రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయి.ఇప్పటి వరకు 180 కంపోస్టు ఫిట్‌ల తవ్వకాలు పూర్తయ్యాయి. రైతులకు మరింత అవగాహన కల్పిస్తున్నాం.

– బి. శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్, ఉపాధిహామీ పథకం, రాజాం.

అవగాహన లేదు



కంపోస్టు ఫిట్‌లపై మాకు అవగాహన లేదు. వాటిని ఎలా నిర్మించాలో తెలియదు. అందుకే వదిలేశాం. పథకం గురించి వివరిస్తే మా పొలాల్లో నిర్మిస్తాం.

– చాపల సోమేశ్వరరావు, రైతు, కాకరాపల్లి, సంతకవిటి మండలం.

విమర్శల నుంచే ఉత్తమ సాహిత్యం



మాట్లాడుతున్న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ కాశీం

రాజాం సిటీ: విమర్శల నుంచే ఉత్తమ సాహిత్యం బయటకు వస్తుందని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ చింతకింది కాశీం అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక సమావేశం కో–కన్వీనర్ పిల్లా తిరుపతిరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కాశీం 'సమాజం – సాహిత్యం– సాంస్కృతిక చైతన్యం' అనే అంశంపై మాట్లాడారు. సామాజిక అవసరమే సాహిత్యమని, రచయితలు సహజత్వంలో ఉండాలని అన్నారు. మనిషి అంటే ఏదో వ్యక్తిగతం కాదని, మనిషంటే సమాజమేనని తెలిపారు. సృజనకారులు ఎల్లప్పుడూ విమర్శలకు గురికావాలని, అలాంటప్పుడే ఉత్తమ సాహిత్యం బయటకు వస్తుందని పేర్కొన్నారు. దేశీయ వ్యక్తీకరణ అనేది సాహిత్యంలోకి విరివిగా రావాలని కోరారు. ఎవరి అస్తిత్వం వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుందని తెలిపారు. గురజాడ ఆధునికతకు ఆద్యుడని, మౌఖిక సాహిత్యానికి కళింగాంధ్ర దన్నుగా నిలిచిందని కొనియాడారు. కళింగాంధ్ర వెనుకబాటుకు కారణాలను ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు వివరించారు. అంతకుముందు బాలసుధాకర్ మౌళి రచించిన 'కున్నెమ్మ–మరికొన్ని కథలు' అనే సంపుటిని ఆవిష్కరించారు. రచయితలు గండేట గౌరునాయుడు, సిరికి స్వామినాయుడు, దాసరి రామచంద్రరావు, రొంతు గణపతిరావునాయుడు, జరజాన నీలయ్య, సమతం మహేష్, మక్క అప్పలనాయుడు, మజ్జి మదన్, కల్కి మధు, గట్టి పాపారావు, పొట్నూరు కోటిబాబు, శాసపు సత్యనారాయణ, పెంకి చైతన్య, మూడడ్ల శ్రీనివాసరావు, మరిశర్ల గంగారావు, పాదిలాపు శ్రీనివాసరావు, డాక్టర్ ఆల్తి మోహనరావు, సామంతుల రమణ, చుక్క వెంకటినాయుడు, పెదపాటి నితీష్, వారాడ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో బీటీ రోడ్లపై తిరగొద్దు

సంతకవిటి: పొలాలను దమ్ము పట్టే ట్రాక్టర్లను ఇనుప చక్రాలతో తారురోడ్లపై తిప్పితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు హెచ్చరించారు. మండల పరిధిలోని ట్రాక్టర్ల యజ మానులకు, డ్రైవర్లకు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఖరీఫ్ వరి నాట్లు వేసేందుకు దమ్ములు ప్రారంభమయ్యాయని, ట్రాక్టర్ల యజమానులు దమ్ము సెట్లను పొలాల వద్దే ట్రాక్టర్లకు అమర్చుకోవాలని చెప్పారు. దమ్ము సెట్లతో తారు రోడ్లపై ట్రాక్టర్లు నడపడం ద్వారా రోడ్లు దెబ్బతింటాయని, అలా చేయవద్దని సూచించారు.

విద్యాసంస్కరణలపై అధ్యయనం చేయాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మావతి

బొబ్బిలి: వైజ్ఞానిక దృక్పథంతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యమని,విద్యారంగ సంస్కరణలపై అధ్యయనం చేయాలని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)రిటైర్డ్ ప్రొఫెసర్ కె.పద్మావతి సూచించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో 'విద్యా రంగం–వైజ్ఞానిక దృక్పథం' అన్న అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన పద్మావతి మాట్లాడుతూ సమాజంలో మంచి మార్పులకు విద్య ప్రాధాన్యత కలిగిన చోదకశక్తి అని అన్నారు. అటువంటి రంగంలో పనిచేస్తున్న వారు పూర్వం నుంచి వస్తున్న విద్యాసంస్కరణలపై అధ్యయనం చేయాలని సూచించారు.సూడో సైన్స్, సైన్స్‌కు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రచారంలోకి తీసుకెళ్లాలని వివరించారు.ప్రస్తుత ప్రభుత్వ విధానాలు విద్యార్థుల స్వజనాత్మకతకు దోహదపడేలా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు మనమంతా కృషిచేయాలని పిలుపునిచ్చారు.జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటరావు, యూటీఎఫ్ నాయకులు విజయగౌరి,శివానంద, తదితరులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు పెంపు

రేగిడి: పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం గడువు పెంచిందని మండల వ్యవసాయాధికారి(ఏఓ) బి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల పంట దిగుబడి తగ్గినా, నష్టం వాటిల్లినా బీమా కంపెనీలు రైతులకు దిగుబడి వ్యత్యాసం ఆధారంగా పరిహారం చెల్లిస్తాయని పేర్కొన్నారు. మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు ఎకరానికి రూ.165 చొప్పున ఈనెల 31వ తేదీలోగా, వరి సాగు చేస్తున్న రైతులు ఎకరానికి రూ.200లు చొప్పున ఆగస్టు 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలని స్పష్టం చేశారు. రైతులు మీసేవా కేంద్రాలకు భూమి పత్రాలు, పంటసాగు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా తీసుకుని వెళ్లి ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు



బాడంగి యూనిట్ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సభ్యులు



బొబ్బిలి యూనిట్ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

బొబ్బిలి: స్థానిక ఎన్జీఓ హోంలో బొబ్బిలి యూనిట్ పంచాయతీరాజ్(పీఆర్) మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలను ఆది వారం నిర్వహించారు.ఎన్నికల అధికారిగా జిల్లా సంఘం ట్రెజరర్ పి.ఎం.రవికుమార్ వ్యవహరించారు. బొబ్బిలి యూనిట్ శాఖ అధ్యక్షుడిగా బేతనపల్లి శ్రీనివాసులునాయుడు,సెక్రటరీగా పి.కృపాపాల్, ఉపాధ్యక్షురాలుగా బి.రమాదేవి, ఆర్గనైజింగ్ సెక్రట రీగా కె.ఉమామహేశ్వరావు, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.నారాయణరావు, సీహెచ్.శ్రీనివాసరావును ఉద్యోగులు ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీ, ఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి ఆల్తి రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి యూనిట్ అధ్యక్షుడిగా శ్యామలరావు

బాడంగి: పంచాయతీరాజ్(పీఆర్) మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం బాడంగి యూనిట్ అధ్యక్షుడిగా రెండోసారి యడ్ల శ్యామలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పీఐయూ కార్యాలయంలో బాడంగి యూనిట్ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికను జిల్లా ఏపీ ఎన్‌జీఓ కార్యదర్శి ఆవు సురేష్, సంఘం జిల్లా అధ్యక్షుడు చింతాడ మురళీ, జిల్లా యూనిట్ సభ్యులు ఆల్తి రమణమూర్తి, వర్మ, శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించారు. బాడంగి యూనిట్ ఉపాధ్యక్షుడిగా మండల పరిషత్ ఏఓ డి.వి.ఎస్.శ్రీలత, కార్యదర్శిగా కె.రవి, సంయుక్త కార్యదర్శిగా తెంటు రాంబాబు, ట్రెజరర్‌గా యామల వేణునాయుడు,జిల్లా కౌన్సిలర్లుగా తెర్లాం మండల పరిషత్ ఏఓ వెంకట రమణ, నందబలగ హైస్కూల్ జూనియర్ సహాయకులు పి.జ్యోత్స్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా జిల్లా సంఘం సభ్యులు పి.ఎం.కుమార్, లక్ష్మణకుమార్ వ్యవహరించారు.

డంపింగ్ యార్డ్‌లా ఆర్టీసీ బస్టాండ్



ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త

రాజాం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తతో డంపింగ్ యార్డులా తయారైంది. ఆర్టీసీ బస్సులు వెయిటింగ్ ప్రాంతం పక్కనే పలువురు విచ్చలవిడిగా పాలిథిన్ సంచులతో పాటు భోజన పార్శిళ్ల సంచులు, డ్రింక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను పారబోస్తున్నారు. ఇవి కుప్పలుగా ఏర్పడి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో ఈ ప్రాంతానికి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సరస్వతీదేవికి చిన్నారుల పూజలు



రాజాం పట్టణంలోని తాణావీధి విష్ణు కోవెలలో వాసవీక్లబ్ 'మన రాజాం–సారథి' ఆధ్వర్యంలో ఆది వారం సరస్వతీదేవికి చిన్నారులతో పూజలు చేయించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి 175 మంది చిన్నారులు హాజరయ్యారు. ముందుగా చిన్నారులతో గోవింద నామాలు చెప్పిస్తూ ఆలయ ప్రదక్షిణ చేయించారు. – రాజాం సిటీ

ఘనంగా దేశమ్మతల్లి పండగ



బాడంగి మండలంలోని ముగడ,కోడూరు,వీరసాగరం తదితర గ్రామాల్లో దేశమ్మతల్లి వారాల పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఖరీఫ్ వరి నాట్లకు ముందు వారాల పండగ చేయడం ఈ గ్రామాల్లో ఆనవాయితీ. ఈఏడాది కూడా వారాల పండగ చేసుకున్నారు. ఆయా గ్రామాల వారంతా పూజారుల వెంట ఊరేగింపుగా గ్రామా ల శివారులో ఉన్న దేశమ్మతల్లి గద్దెల వద్దకు చేరుకుని పసుపు, కుంకుమ,చీరలు, సమర్పించి మొక్కులు చెల్లించుకు న్నారు. – బాడంగి

నేడు 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ'

వంగర: శివ్వాం గ్రామంలో 'బాబు ష్యూరిటీ –మోసం గ్యారంటీ' కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోంది



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డాక్టర్ తలే రాజేష్, ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

రాజాం: వైఎస్సార్‌సీపీని రాజకీయంగా ఎదుర్కోలేక కూటమి ప్రభుత్వం తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ఎంపీ మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్టు చేసిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుచరులను ఇబ్బంది పెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని అన్నారు.ఎవరినో ఇబ్బందిపెట్టేందుకు..ఇంకెవరినో అరెస్టులు చేసి, వారితో తప్పుడు పేర్లు చెప్పించి దొంగ కేసులు పెడుతోందని విమ ర్శించారు. ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి, ఇలా తప్పుడు కేసులతో ప్రతిపక్ష పార్టీ నేతలను భయపెట్టడం సబబుకాదని హితవుపలికారు. ఇలాంటి నీచసంస్కృతికి తెరతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు ఆపార్టీ నాయకులు, జనసేన పార్టీ నేతలు భవిష్యత్‌లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తూ కూటమి చేస్తున్న అరాచకాలను ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. మిథున్‌రెడ్డి అరెస్టు రాజకీయ కక్ష సాధింపేనని, పెద్దిరెడ్డి కుటుంబాన్ని, వైఎస్సార్‌సీపీని ఇబ్బందిపెట్టడమేనని అన్నారు. ఇలాంటి అంతులేని దారుణాలను సహించేదే లేదని, ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండగడతామని తెలిపారు. వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, ఉత్తరావెల్లి గణేష్‌బెనర్జీ, పలుగ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు



మాట్లాడుతున్న ఉత్తరాంధ్రసాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి

బొబ్బిలి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని, రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఈ ప్రభుత్వంలో కనీసం చలనం లేదని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు విమర్శించారు. బొబ్బిలిలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలను సాగు చేస్తుంటే ప్రభుత్వం కనీసం గిట్టుబాటు ధర అందించడం లేదని మండిపడ్డారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయని, రైతుల ఆత్మహత్యలను ప్రభుత్వం చులకనగా చూస్తూ నష్టపరిహారం కూడా అందించడం లేదని ఆరోపించారు. ఏడాదికి రూ.20 వేలు సాగు పెట్టుబడి సాయం అందిస్తామని కూటమి పెద్దలు హామీ ఇచ్చారని, గత ఖరీఫ్‌లో సాయం అందలేదని, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలల గడుస్తున్నా నేటికీ సాయం అందలేదన్నారు. 20వేల రూపాయలు సాగుపెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ ఏమైందో పాలకులు రైతులకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి భూములను బలవంతగా సేకరించి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న దగాకోరు ప్రభుత్వంపై రైతులు తిరగబడి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వజ్జి రమేష్, రవికుమార్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.